

మహా పూజకు వేళాయె
8లో▸

రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన, ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా మహాపూజకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని శనివారం రాత్రి 10:30 గంటలకు పవిత్ర గంగాజలంతో నాగోబాకు అభిషేకిస్తారు.



చదువులమ్మకు కోరుకున్న చీర..

బాసర శ్రీ జ్ఞానసరస్వతీ అమ్మవారికి వసంత పంచమిని పురస్కరించుకుని పద్మశాలి సంఘం తరఫున ప్రత్యేకంగా చేనేత చీర సిద్ధమవుతోంది. ఏళ్లుగా పద్మశాలీలు చేస్తున్న విన్నపానికి ఈ ఏడాది మోక్షం కలిగింది.
10లో▸

గరిష్టం/కనిష్టం
32.1 /17.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా అనిపిస్తుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

పట్టాలెక్కుతున్న ఇళ్లు!

వారంతా దశాబ్దాలుగా బెల్లంపల్లి పట్టణంలో నివాసం ఉంటున్నారు. సింగరేణి, ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల క్రితమే ఇళ్లు నిర్మించుకున్నారు. ఇంటి నంబర్, విద్యుత్, నల్లా కనెక్షన్ ఉన్నా.. ఇళ్లపై మాత్రం ఎలాంటి హక్కు లేకుండా పోయింది. దీంతో తమ ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని ఏళ్లుగా పోరాడుతున్నారు. పాతికేళ్లుగా ఇళ్ల పట్టాల అంశం ఎన్నికల హామీగా మారింది. ఎట్టకేలకు ఆ ఇళ్లన్నీ 'పట్టా'లకెక్కుతున్నాయి. బెల్లంపల్లి పుర ప్రజల ఆకాంక్ష త్వరలో నెరవేరబోతోంది.

- క్రమబద్ధీకరణలో కదలిక
- సర్వే ప్రారంభించిన మున్సిపల్ అధికారులు
- నెరవేరబోతున్న బెల్లంపల్లి వాసుల ఆకాంక్ష



ఓ ఇంటిని సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బెల్లంపల్లి: బొగ్గు గనుల పుట్టుకతో బెల్లంపల్లి ఆవిర్భవించింది. తొమ్మిదిన్నర దశాబ్దాల చరిత్ర ఉన్న పట్టణానికి ఉద్యోగం, ఉపాధి కోసం వేల మంది వలస వచ్చారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రామంగా ఏర్పడిన బెల్లంపల్లి దినదినాభివృద్ధి చెందుతూ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. అయితే దశాబ్దాల క్రితం స్థిర నివాసాలు కట్టుకున్న వారికి మాత్రం ఇళ్ల పట్టాలు లేకుండా పోయాయి. దశాబ్దాల క్రితం కట్టుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని ఏళ్లుగా పట్టణవాసులు పాలకులను కోరుతున్నారు. ఎన్నికల వేళ తమను గెలిపిస్తే పట్టాలు ఇప్పిస్తామన్న నేతలు గెలిచాక విస్మరించారు. దీంతో సొంత ఇళ్లు ఉన్నా వాటిపై హక్కు లేకపోవడంతో పట్టణవాసులు ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. పాత ఇళ్లను పునర్నిర్మించుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. పట్టా లేని కారణంగా మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. తద్వారా బల్దియా కూడా ఆదాయం కోల్పోతోంది.

ఎట్టకేలకు అనుమతి..

దశాబ్దాల కష్టాలకు చెక్ పెడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ, సింగరేణి లీజు భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలు జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు జిల్లాలోని క్యాతన్‌పల్లి, మందమర్రి, నస్పూర్ మున్సిపాలిటీల్లో ఇళ్ల పట్టాల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. సాంకేతిక కారణాలతో బెల్లంపల్లిలో ఆ ప్రక్రియ ఆలస్యమైంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేయడంతో బెల్లంపల్లి బల్దియాలో కూడా ఇళ్ల పట్టాల జారీకి మార్గం సుగమమైంది.

యుద్ధ ప్రాతిపదికన సర్వే..

ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల ఇళ్ల సర్వేను రెవెన్యూ అధికారులు కొద్ది రోజుల క్రితమే పూర్తి చేశారు. సిబ్బందిని ఇంటింటికీ పంపించి ఇంటి యజమానిని విచారణ చేశారు. దరఖాస్తు చేసుకున్న అర్జీదారు భూమి(ఇంటి) కొలతలు తీసుకుని పట్టాల జారీ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అంతే వేగవంతంగా లబ్ధిదారుల పేరుమీద భూమి రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. విడతల వారీగా పుర ప్రజలను మంచిర్యాలలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపించి భూములను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. వారంలో రెండు రోజులు(మంగళ, శుక్రవారం) బెల్లంపల్లి వాసులకు రిజిస్ట్రేషన్ చేయడానికి రిజిస్ట్రార్ అవకాశం కల్పించారు. రోజుకు 20 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయించి పుర ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

6,500 మందికి ఇళ్ల పట్టాలు

బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. కాల్‌టెక్స్, రైల్వేస్టేషన్ ఏరియా, పెద్దనపల్లి బస్తీ, గంగారంనగర్ కొంత భాగం మినహా ఇతర మెజారిటీ ప్రాంతాల్లో పట్టా భూములు లేవు. ప్రభుత్వ, సింగరేణి లీజు భూములు ఆక్రమించుకుని 98 శాతం మంది శాశ్వత ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఇప్పటి వరకు ఇళ్ల పట్టాల కోసం 6,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ పట్టాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇళ్ల పట్టాల జారీతో బెల్లంపల్లి స్వరూపం మారుతుందని పట్టణవాసులు పేర్కొంటున్నారు.

డిమాండ్ నోటీసులు సిద్ధం..

పరిమితికి మించి భూమి కలిగి ఉన్న అర్జీదారులకు డబ్బుల చెల్లింపు కోసం డిమాండ్ నోటీసులు సిద్ధం చేస్తున్నారు.100 గజాల వరకు భూమి కలిగి ఉన్న అర్జీదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తుండగా అంతకన్నా ఎక్కువ స్థలం ఉన్నవారు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారంగా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈమేరకు అర్జీదారుల జాబితాను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం 100 గజాలలోపు భూమిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అధికంగా ఉన్నవారు ముందస్తుగా డబ్బుల చెల్లింపుల కోసం నోటీసులు ఇవ్వనున్నారు. సదరు వ్యక్తులు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించిన తర్వాత స్థలం రిజిస్ట్రేషన్ చేయిస్తారు.

వేగంగా ప్రక్రియ..



ఇళ్ల పట్టాల జారీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ప్రస్తుతం ఇంటింటా సర్వే పూర్తిచేసి అర్జీదారుల జాబితాను తయారు చేసేపనిలో ఉన్నాం. 100 గజాలలోపు భూమి కలిగి ఉన్న వారి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాం. అంతకన్నా ఎక్కువ భూమి ఉంటే ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇస్తున్నాం.ఫిబ్రవరిలో పట్టాలు పంపిణీ చేసే అవకాశం ఉంది.

– జి.కుమారస్వామి, తహసీల్దార్, బెల్లంపల్లి

ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తాం..



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారంగా ప్రభుత్వ, సింగరేణి లీజు భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అంగీకరించారు. ఈమేరకు ప్రభుత్వం జీవో 76 జారీ చేసింది. ఈ జీవో ప్రకారంగా బెల్లంపల్లిలో అర్హత కలిగిన ప్రతీ అర్జీదారుడి ఇంటికి పట్టా ఇస్తాం. పట్టణవాసుల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరుస్తాం. ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలి.

– దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్యే, బెల్లంపల్లి

ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



పాల్గొన్న జిల్లా కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాల అగ్రికల్చర్: జాతీయ ఓటరు దినోత్సం ఈ నెల 25న ఘనంగా నిర్వహించాలని, ఓటు హక్కు సక్రమంగా వినియోగించడం ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకుని దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా, పారదర్శకంగా వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఓటరు దినోత్సవం, పీఎస్ఈ ఎంట్రీ ధ్రువీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, ఓటర్ ఐడీతో ఆధార్ అనుసంధానం ప్రక్రియపై మాట్లాడారు. రాబోయే 15 రోజుల్లో ఓటరు జాబితాలో ఉన్న పీఎస్ఈ ఎంట్రీలు 100 శాతం క్షేత్ర పరిశీలన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాటను మైక్‌ల ద్వారా వినిపించాలని తెలిపారు. స్థానిక కేబుల్ చానెళ్లు, సినిమా థియేటర్లలో ప్రదర్శించాలని సూచించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. 80 ఏళ్లు దాటిన ఓటర్లను, నూతన ఓటర్లను సన్మానించాలని తెలిపారు. ఈ సంవత్సరం ఓటరు దినోత్సవం థీమ్ అయిన "నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్" ప్రకారం ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్ భారతి హోళ్లికేరి మాట్లాడుతూ నూతన ఓటరు నమోదు, ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం ప్రక్రియపై వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటరు దినోత్సవం విజయవంతం చేసే దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జీగా.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగా ?

- మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్ బాధ్యతలపై విజిలెన్స్ అధికారుల అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్‌కు ఏడు నెలలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి బాధ్యతలు ఇవ్వడంపై విజిలెన్స్ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయం తనిఖీలు చేసేందుకు వెళ్లగా తాళం వేసి ఉండడంతో తిరిగి వెళ్లిపోయారు. సాయంత్రం మళ్లీ వచ్చి పరిశీలించారు. గోదాం స్టాక్‌లో 15 క్వింటాళ్ల బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించారు. గతంలో వేంపల్లిలో గోదాం నిర్వహించినప్పుడు స్టాక్‌లో భారీగా తేడా ఉన్నట్లు గుర్తించారు. అప్పటి ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగి కాకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి గోదాం బాధ్యతలు ఇవ్వడంపై ఆరా తీశారు. ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఉద్యోగి తను కూడా విధులు అయిష్టంగానే నిర్వహిస్తున్నట్లు అధికారులకు తెలిపాడు. బియ్యం నిల్వలో తేడా, రెగ్యులర్ ఉద్యోగి లేక పోవడంపై రిపోర్టు రాసుకుని వెళ్లిపోయారు. దీనిపై ఉన్నతాధికారులు నివేదిక ఇస్తామని తెలిపారు. తనిఖీల్లో రాష్ట్ర విజిలెన్స్ అధికారులతోపాటు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ' ర్యాంకు సాధించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో పరిశుభ్రతను పెంపొందించి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేలా కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ గౌతమి అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం పనితీరును శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ బడ్జెట్ తయారీ విధానం గురించి తెలుసుకున్నారు.

పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న కళాశాల సిబ్బంది

మంచిర్యాలటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు టీజీయూజీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుమతి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.సునీత పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు

నస్పూర్: పట్టణ పరిధిలోని అక్రమ వెంచర్ల హద్దురాళ్లను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. పట్టణంలోని సీతారాంపల్లి, నస్పూర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన నాలుగు వెంచర్లలోని హద్దురాళ్లను మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా పట్టణంలో ఎలాంటి వెంచర్లు ఏర్పాటు చేయొద్దని హెచ్చరించారు. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొని మోసపోవద్దు సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి సతీశ్, బిల్ కలెక్టర్ శీపతి సురేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగుల స్పందన లభించిందని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. ప్రైవేట్ సెక్టార్ కార్పొరేట్‌లో ఉద్యోగాలు పొంది అంచెలంచెలుగా ఎదగాలని అభ్యర్థులకు సూచించారు. అపోలో ఫార్మసిలో ఫార్మసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్టు ఉద్యోగాలకు అపోలోఫార్మసీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ సుమన్‌గౌడ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 50 పోస్టులకు 35 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 20 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి పోస్టింగ్ లెటర్ ఇచ్చారు. మంచిర్యాలలో ఏడుగురికి, లక్సెట్టిపేటలో ముగ్గురికి, ఆసిఫాబాద్‌లో ఇద్దరికి హైదరాబాద్‌లో 23 మందికి పోస్టింగ్ ఇచ్చామని సుమన్‌గౌడ్ తెలిపారు.

వాషింగ్ ప్లాంటు ప్రారంభం

మంచిర్యాల అర్బన్: ఆర్టీసీ బస్సులు పరిశుభ్రంగా ఉంచేందుకు మంచిర్యాల డిపోలో ఏర్పాటు చేసిన కొత్త వాషింగ్ ప్లాంట్‌ను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. వాషింగ్ ప్లాంట్ బస్సుబాడీ సైడ్‌లు బ్రష్‌తో శుభ్రం చేస్తుందన్నారు. ఆధునిక వాషింగ్ ప్లాంట్‌తో పూర్తిస్థాయిలో బస్సులపై మరకలు తొలగిపోతాయని పేర్కొన్నారు. అంతకుముందు బస్‌స్టేషన్, డిపో పరిసరాలు, గ్యారేజీను పరిశీలించారు. డిపో పరిధిలో కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వర్క్స్ మేనేజర్ సుగుణాకర్, డీఎం రవీంద్రనాథ్ ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ భారతి హోళ్లికేరి



జిల్లా కేంద్రంలోని కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/నస్పూర్/దండేపల్లి/భీమారం: ప్రజల కంటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో వయోవృద్ధుల డేకేర్ సెంటర్, జెడ్పీ కార్యాలయం పక్కన ఎస్టీ బాలుర హాస్టల్‌లో కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమాల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. పరీక్షలకు వచ్చిన వృద్ధులతో మాట్లాడారు.

- హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. 18 ఏళ్లు పైబడిన అందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తుండగా అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేస్తున్నారు.
- లక్సెట్టిపేట మండలం అంకతిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. శిబిరానికి వస్తున్నవారి వివరాలు తెలుసుకున్నారు. అందరికీ పరీక్షలు చేసి అవసరమైన వారికి అద్దాలు ఇవ్వాలన్నారు. శిబిరానికి వచ్చే వారికి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.
- దండేపల్లి మండలం చెల్కగూడ, కొండాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు సందర్శించారు. సిబ్బందికి సూచనలు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి కంటి రక్షణపై అవగాహన కల్పించారు.
- భీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని, నస్పూర్ కాలనీలోని కంటివెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ తనిఖీ చేశారు. కంటి పరీక్షలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తొందర పడాల్సిన అవసరం లేదని నెల రోజులపాటు శిబిరం కొనసాగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో రెండోరోజు కంటి పరీక్షల వివరాలు

జిల్లాలోని కంటి పరీక్షా కేంద్రాలు	40
రెండోరోజు కంటి పరీక్షలు చేయించుకుంది	6,030
రీడింగ్ గ్లాసులను అందించింది	1,642
కంటి అద్దాల కోసం రెఫర్ చేసింది	1,070

మన బడి.. మన ఇష్టం

- సెలవులు ముగిసినా తెరుచుకోని సాలిగామ పాఠశాల



తలుపులు తెరుచుకోని సాలిగామ ప్రభుత్వ పాఠశాల

నెన్నెల: 'మన బడి మన ఇష్టం... మనం వెళ్లిన రోజే బడి నడుస్తుంది.. మనం వెళ్లకుంటే సెలవు' అనుకుంటున్నారు నెన్నెల మండలం సాలిగామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. సంక్రాంతి సెలవులు ముగిసి మూడు రోజులైనా పాఠశాల ఇప్పటికీ తెరుచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించింది. 18న పాఠశాలలు పునఃప్రారంభించారు. సాలిగామ పాఠశాల ఏకైక టీచర్ బడికి రాకపోవడంతో పాఠశాల ఇప్పటికీ పునఃప్రారంభం కాలేదు. విద్యార్థులు మూడు రోజులుగా పాఠశాల వరకు వచ్చి.. తాళం తీయకపోవడంతో తిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 24 మంది మూడు రోజులుగా ఇళ్లకే పరిమితమవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో టీచర్ సమ య పాలన పాటించడం లేదని, సమాచారం లేకుండా గైర్హాజర్ అవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మండల విద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తనకు కూడా ముందస్తుగా ఎలాంటి సమాచా రం లేదని తెలిపారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఇబ్బంది పడకుండా చేస్తానని పేర్కొన్నారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ రమేశ్‌కుమార్



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న రమేశ్‌కుమార్

బెల్లంపల్లిరూరల్: జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రమేశ్‌కుమార్ అన్నారు. బెల్లంపల్లి మండల పశు వైద్యశాలలో శుక్రవారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన శిబిరాన్ని ప్రారంభించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై మంజూరు చేసిన పెరటి కోళ్ల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం రమేశ్‌కుమార్ మాట్లాడుతూ జంతువులు మానవాళి సహకారంతోనే జీవనం సాగిస్తాయన్నారు. పెంపుడు, మూగ జీవాల సంరక్షణ కోసం వాటి యజమానులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జీవాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు టీకాలు వేయించాలన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సబ్సిడీ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ శంకర్, మండల పశువైద్యాధికారి పావని, సిబ్బంది శ్రావణ్, సోనేరావు, తిరుపతి, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

గుట్టుగా ఇసుక రవాణా!

- లారీల్లో ఓవర్ లోడ్
- రాత్రివేళ అక్రమ రవాణా
- గోదావరి నుంచి తరలింపు
- జిల్లా కేంద్రంలోని ఓ వేబ్రిడ్జి కేంద్రంగా దందా



కొల్లూరు క్వారీలో ఇసుక నింపుతున్న జేసీబీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గోదావరి నుంచి ఇసుక రాత్రి వేళ అక్రమంగా తరలిపోతోంది. ఈ ఏడాది వచ్చిన వరదలు, పెద్దపల్లి జిల్లా మానేరు పరిధిలో అధికంగా రీచ్‌ల అనుమతి కారణంగా జిల్లాలో ఇసుక ఆర్డర్లు తగ్గిపోయాయి. జిల్లాలో 12 రీచ్‌లకు అనుమతులు రాగా, ఆర్డర్లు లేకపోవడంతో ప్రస్తుతం కోటపల్లి మండలం కొల్లూరు 4, 7, 8 రీచ్‌లు మాత్రమే అధికారికంగా నడుస్తున్నాయి. సాగు నీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనుల కోసం గోదావరి రీచ్‌లకు వేరేగా అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం కొల్లూరు 4 పరిధిలో రోజుకు సగటున 3వేల క్యూబిక్ మీటర్లు అందులో ఉండగా, మిగతా వాటిలో వెయ్యి క్యూబిక్ మీటర్లు చొప్పున అందుబాటులో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో క్వాంటిటీ చూపిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే, సంబంధిత క్వారీకి వెళ్లి రిజిష్టర్ చేసుకున్న వాహనాలతో రవాణా చేయాలి. ఇదంతా టీఎస్ఎండీసీ(తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్) అధికారుల పర్యవేక్షణలో జరుగుతుంది. సంబంధిత కాంట్రాక్టరు ఇసుకను గోదావరి నుంచి తోడి స్టాక్ యార్డుల తరలించి, అక్కడ వాహనాల్లో లోడింగ్ చేయాలి. అయితే జిల్లా పరిధిలో రీచ్‌లపై అధిక వర్షాలు ప్రభావం చూపాయి. మరోవైపు ఇతర జిల్లాల్లో అధికంగా ఇసుక క్వారీలకు అనుమతి వచ్చాయి. దీంతో ఈసారి ఆర్డర్లు తక్కువగా వస్తున్నాయి. రోజు వారీగా వెబ్‌సైట్‌లో చూపించిన ఇసుక నిల్వలను చూసి, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల, హైదరాబాద్ తదితర సమీప ప్రాంతాల నుంచి కొన్ని ఆర్డర్లు వస్తున్నాయి. దీంతో స్కాట్ పాయింట్‌కు వచ్చిన లారీల్లో జేసీబీతో అదనపు బకెట్ ఇసుక లోడ్ చేస్తున్నారు. ఇందుకు రూ.500 వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పటికీ అంతా 'మామూలుగా' సాగుతోంది.

ఆర్డర్లు తగ్గినా ఆగని అక్రమాలు..

ఇసుక ఆర్డర్లు తగ్గిపోయాయని చెబుతూనే.. క్వారీల పరిధిలో అక్రమాలు మాత్రం తగ్గడం లేదు. నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. క్వారీ సమీపంలోని అసైన్డ్ భూముల్లో మొరం తవ్వి, రోడ్డు వేసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా భారీగా మట్టి తరలించారు. ఇసుక తరలించేందుకు వీలుగా వందల ట్రిప్పుల మట్టిని రోడ్డు వేసేందుకు వాడుకున్నారు. మరోవైపు గోదావరిలో నీటి ప్రవాహం తగ్గుతోంది. ఇసుక రవాణా పెంచేందుకు కాంట్రాక్టర్ల ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆర్డర్లు ఎక్కువగా వచ్చేందుకు లారీల్లో అధికంగా ఇసుక నింపడంతో పాటు జాప్యం లేకుండా కస్టమర్‌కు ఇసుక అందిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలను ఎవరూ అడ్డుకోకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వేబ్రిడ్జి కేంద్రంగా దందా..

జిల్లా కేంద్రంలో ఓ వేబ్రిడ్జి ఇసుక అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది. ఇసుక కాంట్రాక్టరుగా పేరొందిన ఓ వ్యక్తికి చెందిన వేబ్రిడ్జి నుంచే ఇసుక లోడింగ్‌తో వచ్చే వాహనాలు తూకం వేస్తున్నారు. ఇక్కడికి జైపూర్ మండల పరిధిలోని రసూల్‌పల్లి, మంచిర్యాల పరిసర ప్రాంతాల నుంచి వాగులు, గోదావరి నుంచి వాహనాలు వస్తున్నాయి. రాత్రి, తెల్లవారు జామున వచ్చే ఇసుక వాహనాల కోసమే తోళ్లవాగు సమీపంలో ఉన్న ఈ బ్రిడ్జి పని చేస్తోంది. ఆన్‌లైన్‌లో చెల్లించిన వాటితోపాటు జీరో దందా సాగించే వాహనాలు ఈ బ్రిడ్జిని ఉపయోగించుకుంటున్నాయి. సమీప ప్రాంతంలో ఇసుక కావాల్సిన వారికి గుట్టుగా పంపిస్తున్నారు. ఆ వేబ్రిడ్జి యాజమానికి సంబంధించిన వాహనాలు ఇసుక రవాణా చేస్తున్నాయి. ఇసుక లోడ్ అయిన సమయం నుంచి అన్‌లోడ్ అయ్యేవరకు ప్రతీది నిబంధనల ప్రకారమే జరగాలి. నిబంధనల ప్రకారం మొదటి నాలుగు గంటల్లో 50కి.మీ, ఆ తర్వాత ప్రతీ 50 కి.మీలకు రెండు గంటల చొప్పున దూరం చేరుకునేందుకు సమయం ఉంటుంది. కానీ లోడింగ్ జాప్యం జరిగిందంటూ ఆలస్యంగానే వెళ్తున్నాయి.

సేవాలాల్ ఆలయానికి రూ.12 లక్షలు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లంబాడాలు

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో జగదాంబ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 లక్షలు మంజూరు చేసిందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. బూర్గుపల్లిలో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని లంబాడాలు బాల్క సుమన్‌ను కోరారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వుల కాపీ విడుదల చేశారు. 2024లో సేవాలాల్ జయంతి నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేసి కొత్త ఆలయంలో వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సేవాలాల్ ఆలయానికి నిధులు మంజూరు కావడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి లంబాడీలు క్షీరాభిషేకం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన విప్ బాల్క సుమన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూక్యా తిరుమల, చెన్నూరు మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ భూక్యా రాజ్‌కుమార్‌నాయక్, సర్పంచ్ వడ్లకొండ రమాదేవి, లంబాడీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్ (రాజన్నలవాడ)లో శుక్రవారం 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కాలనీకి చెందిన మోటం రాజు ఇంట్లో తనిఖీ నిర్వహించగా రెండు వాహనాల్లో రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 90 బియ్యం సంచులు పట్టుకున్నామన్నారు. నిందితుడితో పాటు రెండు వాహనాలు, బియ్యం స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మందమర్రి పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై లచ్చన్న, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా



జరిమానా ప్రతిని అందిస్తున్న తహసీల్దార్

బెల్లంపల్లి: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఒకరికి రూ.లక్ష జరిమానా విధించినట్లు బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.దీపక్ తెలిపారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన లావుడియా వినోద్ నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న కేసులో రెండోసారి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈమేరకు బైండోవర్ నిబంధనలు బేఖాతరు చేసినందుకు కాసిపేట తహసీల్దార్ దిలీప్‌కుమార్ సదరు వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించారు. దీంతో శుక్రవారం నిందితుడు వినోద్ నిర్దేశించిన జరిమానా చెల్లించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

వాహనదారుడికి జరిమానా



మాస్క్ ధరించి తిరుగుతున్న వ్యక్తి

మంచిర్యాలక్రైం: నంబర్ ప్లేట్‌కు మాస్క్ వేసి ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఓ వాహనదారుడికి స్థానిక పోలీసులు ఈ–చలాన్ ద్వారా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నారాయణ్‌నాయక్ తెలిపారు. శుక్రవారం రైల్వే స్టేషన్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు ద్విచక్ర వాహనానికి (స్కూటి) నంబర్ ప్లేట్ కనిపించకుండా మాస్క్ వేసి పట్టుబడ్డాడు. వాహనం గైక్వాడ్ రేఖ పేరుతో రిజిస్ట్రేషన్ ఉంది. రేఖ కుమారుడు భాస్కర్ ఇలా తప్పించుకుని తిరుగుతుండగా పట్టుకున్న పోలీసులు వాహనంపై ఉన్న పెండింగ్ చలాన్ రూ.1,540 క్లియర్ చేయించినట్లు సీఐ పేర్కొన్నారు.

బంగారు గొలుసు చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రవీందర్ తెలిపారు. కాపువాడకు చెందిన వృద్ధురాలు లచ్చవ్వ రైల్వేస్టేషన్ వద్ద పండ్లు విక్రయించి తిరిగి ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

మహా పూజకు వేళాయె



నాగోబా విగ్రహం



ముస్తాబైన నాగోబా ఆలయం

- నేడు నాగోబాకు గంగాజలాభిషేకం
- ఏర్పాట్లు చేసిన మెస్రం వంశీయులు
- మహాపూజ అనంతరం జాతర ప్రారంభం
- ఈ నెల 22న కేంద్రమంత్రి అర్జున్ ముండా రాక
- 24న దర్బార్.. హాజరుకానున్న మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి

జాతర ఏర్పాట్లు పూర్తి

నాగోబా జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాగోబాను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు, మెస్రం వంశీయుల సౌకర్యార్థం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కేస్లాపూర్ నుంచి నాగోబా ఆలయం వరకు బారీకేడ్లు ఏర్పాటు చేశారు.



ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్స్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన, ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా మహాపూజకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. ఈసారి తమ సొంత నిధులతో నిర్మించుకున్న నాగోబా ఆలయంలో మహాపూజ చేయనున్నారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని శనివారం రాత్రి 10:30 గంటలకు పవిత్ర గంగాజలంతో నాగోబాకు అభిషేకిస్తారు. మహాపూజ అనంతరం ప్రారంభం కానున్న జాతర ఈ నెల 28 వరకు కొనసాగనుంది. నాగోబాను దర్శించుకోవడానికి ఈ నెల 22న కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, 24న నాగోబా దర్బార్ సమావేశానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుకానున్నారు.

మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి హస్తినమడుగు నుంచి సేకరించిన గంగాజలంతో వచ్చి మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు శనివారం ఉదయం కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం నాగోబా ప్రతిమలు, పూజాసామగ్రితో డోలు, పెప్రే, కాళికోమ్ వాయిద్యాలతో శోభాయాత్రగా నాగోబా ఆలయానికి వెళ్లి సంప్రదాయ పూజలు చేస్తారు. మహాపూజకోసం తీసుకువచ్చిన మట్టి కుండల ను 22 కితల మెస్రం వంశం మహిళలకు అంది స్తారు. వారు మెస్రం వంశం పెద్దల ఆశీర్వాదం తీసుకుని మర్రిచెట్టు వద్దగల కోనేరు నుంచి కుండల్లో నీటిని తీసుకువస్తారు. మెస్రం వంశ అల్లుళ్లు నాగోబా ఆలయం పక్కనే ఉన్న పాత పుట్టను తొలగించడంతో మెస్రం వంశ మహిళలు, ఆడపడుచులు కొత్త పుట్టలు తయారు చేస్తారు. అందులో నుంచి కొంతమట్టిని ఉండల్లా చేసి సతీదేవత ఆలయంలో ఏడువరుసల్లో బౌలను తయారు చేస్తారు. ఈ పూజ శనివారం సాయంత్రం వరకు కొనసాగుతుంది. అనంతరం మెస్రం వంశీయులు ఆలయం పక్కనే ఉన్న ప్రత్యేక కట్టడమైన గోవడ్ వద్దకు చేరి కితల వారీగా బస చేస్తారు. అక్కడి నుంచే నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలు చేస్తారు.

పెర్సపేన్, బాన్‌దేవతకు పూజలు

నాగోబా మహాపూజల అనంతరం మెస్రం వంశీయులు ఆదివారం నాగోబా ఆలయం వెనుక ఉన్న పెర్సపేన్(పెద్ద దేవుడు)కు పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. అదే సమయంలో పక్కనే మెస్రం వంశ మహిళలు, భేటింగ్ అయిన కొత్త కోడళ్లు బాన్ దేవతలను తొలగించి కోనేరు బావి నుంచి తీసుకువచ్చిన నీటితో కొత్త బాన్ దేవతలను తయారు చేసి నైవేద్యం సమర్పిస్తారు.

మహాపూజ అనంతరం మెస్రం వంశీయులు రాత్రి ఒంటిగంట తర్వాతర గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకుని భేటింగ్ (నాగోబా దేవత పరిచయం) పూజలు ప్రారంభిస్తారు. ఇప్పటి వరకూ

కొత్త కోడళ్లతో భేటింగ్

నాగోబా సన్నిధికి రాని మెస్రం వంశ కోడల్లు, కొత్తగా వివాహమైన మహిళలు తెల్లని దుస్తులు ధరించి భేటింగ్‌లో పాల్గొంటారు. సతీదేవత ఆలయంతో ప్రత్యేక పూజలు చేసి మెస్రం వంశం పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. దీంతో పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్లుగా భావిస్తారు. ఈ కార్యక్రమం ఆదివారం తెల్ల వారుజాము వరకూ కొనసాగుతుంది.

450 మంది పోలీసులతో బందోబస్తు

నాగోబా జాతరకు ముగ్గురు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 28 మంది ఎస్సైలతో పాటు మొత్తం 450 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఉట్నూర్ సీఐ సైదరావ్ తెలిపారు. జాతరలో 100కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

22న కేంద్రమంత్రి అర్జున్‌ముండా రాక



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: నాగోబాను దర్శించుకోవడానికి ఈ నెల 22న కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా జిల్లాకు రానున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పర్యటన వివరాలు వెల్లడించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవి రమణ, నాయకులు రాళ్ల బండి మహేందర్, గటిక క్రాంతి కుమార్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన షెడ్యూల్

ఉదయం 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. 9:30 వరకు బ్రేక్ ఫాస్ట్ అనంతరం హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా 10.10 గంటలకు కేస్లాపూర్ చేరుకుంటారు. 11:00 గంటల వరకు నాగోబా ఆలయంలో మెస్రం వంశస్తులతో కలిసి మహాపూజలో పాల్గొంటారు. 11:30 గంటలకు మెస్రం వంశీయులతో టీ బ్రేక్ అనంతరం ఒంటిగంట వరకు పబ్లిక్ మీటింగ్, 2 గంటలకు ఆదివాసీలతో లంచ్ అనంతరం 2:40 గంటలకు హైదరాబాద్, 5 గంటలకు ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు.

జాతరకు ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: కేస్లాపూర్ నాగోబా జాతరను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఈ నెల 21 నుంచి 28 వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ఆదిలాబాద్, ఉట్నూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల నుంచి ఉట్నూర్ వైపు వెళ్లే అన్ని బస్సులు కేస్లాపూర్ మీదుగా వెళ్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శాంతిఖని గని పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: శాంతిఖని గని పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు బడికల సంపత్, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడుతూ షాఫ్ట్‌వాల్ టెక్నాలజీతో బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్న శాంతిఖని గనిలో సింగరేణి సంస్థనే ఎస్‌డీఎల్ యంత్రాలను కొనుగోలు చేసి నడిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎస్‌డీఎల్ యంత్రాలు తీసుకురావాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఏరియాలో మూతపడనున్న కేకే–1, ఆర్‌కే–1 గనుల కార్మికులను శాంతిఖని గనికి బదిలీ చేయాలని సూచించారు. 11వ వేజ్‌బోర్డులో జాతీయ కార్మిక సంఘాలు గత వేజ్‌బోర్డు కన్నా తక్కువ శాతం అగ్రిమెంట్ చేసుకుని కార్మికులకు నష్టం కలిగించాయన్నారు. సమావేశంలో రీజియన్ కమిటీ సభ్యుడు రాజశేఖర్, గని పిట్ సెక్రటరీ దాసరి శ్రీనివాస్, నాయకులు రాజనాల రమేశ్, వెంకట రమణ, సిద్ధంశెట్టి సాజన్, రాజనర్సు, మల్లేశ్, ప్రేమ్‌కుమార్, రమేశ్, అంజయ్య పాల్గొన్నారు.

బీఎంఎస్ కృషితోనే మెరుగైన వేతన ఒప్పందం



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): బీఎంఎస్ కృషి ఫలితంగానే బొగ్గు గని కార్మికులకు 11వ వేతన ఒప్పందం మెరుగ్గా జరిగిందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శుక్రవారం ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. మెడికల్ స్కీం, పెన్షన్, క్యాడర్ స్కీం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి వాటిపై త్వరలో కోలిండియా యాజమాన్యంతో చర్చించి మెరుగైన ఒప్పందం చేసుకుంటామన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.25 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్రాంచి కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు అప్పని శ్రీనివాస్, కాసెట్టి నాగేశ్వర్‌రావు, కాదాసి భీమయ్య, వినోద్‌కుమార్, నాగార్జున, రాజు పాల్గొన్నారు.



భేటింగ్ అవుతున్న మహిళలు



రావుడ్ దేవతలకు మొక్కుతున్న భక్తులు

అమ్మా.. ఇక వెళ్లొస్తాం..

- ముగిసిన 'జంగుబాయి'జాతర
- తిరుగుపయనమైన ఆదివాసీలు
- 363 మేళంలు, 2.61 లక్షల మంది భక్తుల దర్శనం
- నెల రోజులపాటు కిటకిటలాడిన పుణ్యక్షేత్రం

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల దైవక్షేత్రం, ఆరాధ్యదైవం జంగుబాయి జాతర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పుష్యమాసం రోజున ప్రారంభమై నెలరోజుల పాటు ఉత్సవాలు కనుల పండుగగా జరిగాయి. భక్తులు మర్రిచెట్టు, పోచమ్మ, రావుడ్, మైసమ్మ, జంగుబాయికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని సుమారు 363 మేళంలు, 2.61 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కొడప జాకు, మరప జాబీరావు తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఆరు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు అమ్మవారిని దర్శించుకున్నారు. మళ్లీ ఈ జాతర మే మాసంలో నిర్వహించనున్నారు.

గంగాజలంతో శుద్ధి

కప్లై, సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల్లో నుంచి గంగాజలం తీసువచ్చి శుక్రవారం ఉదయం దేవతా విగ్రహాలను శుద్ధి చేశారు. సాయంత్రం కేస్లాపూర్‌లోని నాగోబా దేవతతో భేటీకోసం జంగుబాయి తరలివెళ్లనుండడంతో ఉదయాన్నే కార్యక్రమాలు పూర్తి చేశారు.

'దేశంలో ఫాసిస్టు పాలన సాగుతోంది'

పాత మంచిర్యాల: దేశంలో ఫాసిస్టు మతవాదుల పాలన సాగుతోందని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో శుక్రవారం భావప్రకటన స్వేచ్ఛపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మన దేశ పాలకులు ప్రజలంతా మనువాదం, మతవాదం పాటించాలంటూ ఫాసిస్టు పాలన సాగిస్తున్నారని, పౌరులు ఏ తిండి తినాలి, ఏ బట్టలు కట్టుకోవాలి, ఏ భాష మాట్లాడాలి, ఏ దేవున్ని పూజించాలో శాసిస్తున్నారన్నారు. పాఠశాలల్లో సైతం ఆంక్షలు విధిస్తున్నారని, ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ దాడులకు పాల్పడుతున్న వారి చర్యలకు నిరసనగా ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మానవహారం, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తూముల శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి లాల్‌కుమార్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, టీజేఏసీ నాయకుడు బాబన్న, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, డీఎంకే నాయకుడు కే.శ్రీనివాస్, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

మంచిర్యాలటౌన్: విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ విద్యార్థుల గురించి మర్చిపోయి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నారని ఆరోపించారు. వెంకటకృష్ణ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుల ఆంజనేయులు, స్వామిరెడ్డి, ఎతం శివ, దేవేందర్, సాయి, రాకేశ్ రెన్వా, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కుల బహిష్కరణకు కారకుడైన వ్యక్తికి జైలు

వాంకిడి(ఆసిఫాబాద్): ఓ వ్యక్తి కుల బహిష్కరణకు కారకుడైన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం తేజిగూడకు చెందిన గ్రామ పటేల్ రాంచందర్‌కు మూడు నెలల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ పీసీఆర్ కోర్టు జడ్జి యశ్వంత్ సింగ్ చౌహాన్ తీర్పునిచ్చి నట్లు ఎస్సై డీ.సాగర్ తెలిపారు. ఆయన తెలి పిన వివరాల ప్రకారం.. తేజిగూడకు చెందిన ఆదె సంతోష్ కూలీ పనిచేస్తూ జీవనం సాగి స్తున్నాడు. గ్రామంలో మాల కులానికి చెంది న వ్యక్తి మరుగుదొడ్డి నిర్మాణం చేస్తుండగా ఆ యన వద్దకు పనికి వెళ్లాడు. దీంతో గ్రామ ప టేల్ అయిన రాంచందర్ తక్కువ కులానికి చెందిన వ్యక్తి వద్ద పనికి ఎందుకు వెళ్లావని రూ.5వేల జరిమానా చెల్లించాలని, అప్పటివరకు కుల బహిష్కరణ చేస్తున్నట్లు తెలిపాడు. ఈ ఘటన 2015 సంవత్సరంలో చోటు చేసుకోగా బాధితుడు రెండేళ్ల పాటు కులానికి దూరంగా ఉన్నాడు. అనంతరం సంతోష్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై ఎం.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు. అసిస్టెంట్ పీపీ నవీన్ పది మంది సాక్షుల ను కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి తీర్పునిచ్చారు.

'గురుకులం'లో ప్రవేశానికి నోటిఫికేషన్

మంచిర్యాలటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి టీజీయూజీసెట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఫిబ్రవరి 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

తాండూర్ ఎంపీవోపై ఫిర్యాదు

తాండూర్: తాండూర్ మండల పంచాయతీ అధి కారి(ఎంపీవో)పై మండల సర్పంచులు అదనపు కలెక్టర్ రాహుల్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ నిధులకు సంబంధించి తప్పుడు నివేదికలు ఇస్తూ, అనేక విషయాల్లో ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నాడని వారు ఆరోపించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేయడానికి డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు. మండల సమావేశాల్లో పంచాయతీల నిధుల వివరాలపై సభ్యులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో రోజువారీ భోజనాల ఖర్చు రూ.వేలల్లో జరుగుతుండగా కేవలం రూ.వెయ్యి మాత్రమే చెక్కు రాసుకోవాలని సతాయిస్తున్నారని వివరించారు. ఫిర్యాదు చేసినవారిలో కాసిపేట, రా జీవ్‌నగర్, కొత్తపల్లి, నీలాయపల్లి, ఎంసీకే–3, నర్సాపూర్, మాదారం, కిష్టంపేట్, చౌటపల్లి, ద్వారకాపూర్, గోపాల్‌నగర్ , అచ్చులాపూర్, రేచిని సర్పంచులు ఉన్నారు.

బండరాయి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



గ్రామస్తులు పట్టుకున్న ట్రాక్టర్

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి మండలం బొక్కలగుట్ట నుంచి అక్రమంగా బండరాయిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం గ్రామస్తులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వేనంబర్ 139లో కేవలం ఒకటి రెండు ఎకరాలకే అనుమతి తీసుకుని పెద్ద ఎత్తున గుట్టను తవ్వుతూ అక్రమంగా బండరాయిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వానికి రాయల్టీలు కట్టకుండా అక్రమ దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మైనింగ్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో గ్రామస్తులు బలికొండ కిషన్, కుదురుపాక తిరుపతి, శ్రీధర్, ప్రశాంత్, రాజయ్య, తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



మాట్లాడుతున్న కొక్కిరాల సురేఖ

నెన్నెల/తాండూర్/కాసిపేట: ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేస్తూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా రానున్న ఎన్నికల్లో ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. నెన్నెల, తాండూర్, కాసిపేటలో శుక్రవారం ఆమె పర్యటించారు.నెన్నెలలో మాజీ మంత్రి గడ్డం వినోద్ ఆధ్వర్యంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము రాజన్న అధ్యక్షతన కన్నెపల్లి, వేమనపల్లి, భీమిని మండలాల ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించగా ఈ నెల 26నుంచి ప్రారంభమయ్యే హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని పార్టీ నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తాండూర్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరం దామోదర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. కాసిపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, ప్రస్తుతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నందున రానున్న ప్రభుత్వం కాంగ్రెస్‌దే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు గడపగడపకూ వెళ్లాలన్నారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, పీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం వినోద్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, డీసీసీ సభ్యులు గట్టు మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లింగుస్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తి

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న కుర్రేఘాట్‌లో శనివారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న కూపర్ లింగుస్వామి జాతరకు ఆదివాసీలు ఏర్పా ట్లు పూర్తి చేశారు. మండల కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో అడవులు, కొండకోనల మధ్య కుర్రేఘాట్ ఉంటుంది. 21న ఆలయంలో ప్రత్యేక పూజలు, 22న అగ్నిగుండం ప్రవేశం, 23న ఆలయ శుద్ధి కార్యక్రమాలు చేపడతారు. జాతరకు గిరిజనేతరులు సైతం అధిక సంఖ్యలో హాజరుకానున్నారు.



ముస్తాబైన లింగుస్వామి ఆలయం